ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 వరంగల్

ఆదివారం 23 జూన్ 2024



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ కలెక్టరేట్, జూన్ 22: దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో దివ్యాంగులు, వయో వృద్ధులకు ప్రత్యేక ప్రజావాణి నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి వినతులు స్వీకరించి మాట్లాడారు. మొత్తం 15 వినతులు అందగా ఇందులో ఉపాధి కల్పన శాఖకు 5, డీఆర్‌డీఏ 3, సంక్షేమశాఖ 2, పోలీసుశాఖ 1, ఎస్సీ కార్పొరేషన్ 1, జీడబ్ల్యూఎంసీకి 1 వినతి అందినట్లు తెలి పారు. కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి, అధికారులుపాల్గొన్నారు.

టీజీపీఎస్సీ అభ్యర్థులు జాగ్రత్తలు పాటించాలి

వరంగల్ కలెక్టరేట్, జూన్ 22:తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు పలు శాఖల్లో ఉద్యోగాల నిమిత్తం పరీక్ష లు రాసే అభ్యర్థులకు టీజీపీఎస్సీ సెక్రటరీ డాక్టర్ నికోలస్ పలు సూచనలు జారీ చేశారని కలెక్టర్ సత్య శారదాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు గుర్తింపు ధ్రువీకరణ కోసం పరీక్ష కేంద్రంలోకి ఉదయం 8.30 నుం చి ముందస్తు సెషన్‌కు అనుమతించడం జరుగుతుందని, మధ్యాహ్నం సెషన్ 1 గంటకు హాలులోకి అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. బయోమెట్రిక్‌ను ఇన్విజిలేటర్ ద్వారా క్యాప్చర్ చేసే వరకు అభ్యర్థి పరీక్ష హాలు నుంచి బయట కు వెళ్లరాదని తెలిపారు. పరీక్ష హాలులోకి మొబైల్స్, ఎలాంటి ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించడం జరగదని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

ఇన్‌స్పైర్‌లో జాతీయ స్థాయికి వర్మ



వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 22: ఇన్‌స్పైర్-2024లో జాతీయ స్థాయికి జిల్లాలోని నెక్కొండ జడ్పీహెచ్ఎస్ 10వ తరగతి విద్యార్థి బట్టు నిఖిల్ వర్మ ఎంపికయ్యారు. ఈనెల 14, 15 తేదీల్లో వర్చువల్‌గా నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో నిఖిల్ వర్మ పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 259 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో జాతీయ స్థాయికి 25 ప్రదర్శనలను ఎంపిక చేశారు. వీరిలో నిఖిల్ వర్మ ఉన్నారు. నిఖిల్ వర్మ రూపొందించిన వాటర్ క్లీనర్ బోట్ ఎగ్జిబిట్ ప్రదర్శన జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపిక కావడం విశేషం. న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో నిఖిల్ పాల్గొననున్నారు. వర్మతోపాటు గైడ్ టీచర్ విశ్వప్రసాద్‌ను డీఈవో వాసంతి, డీఎస్‌వో శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

నలుగురు పోలీసులకు ప్రతిభా పురస్కార్

వరంగల్ క్రైం, జూన్ 22: విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులకు ప్రతిభా పురస్కార్ అవార్డులు ప్రకటించారు. ఉత్తమ సేవా పథకం టి.యాదగిరి (హెడ్ కానిస్టేబుల్, ఆర్మ్డ్ రిజర్వ్), సేవా పథకాలు కె.శ్రీధర్‌రావు (ఇన్‌స్పెక్టర్), ఎం.డి.సాధిక్ (హెడ్ కానిస్టేబుల్, ఏఆర్), ఎం.భిక్షపతి (కానిస్టేబుల్, ఏఆర్), జి.శ్రీనివాస్ (కానిస్టుబుల్, ఏఆర్) పథకాలు పొందారు. 2023-24 సంవత్సరానికి ఎంపికైన వీరు ఆగష్టు 15న పురస్కారాలు అందుకోనున్నారు.

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందని వైద్యం
- కనీస సౌకర్యాలు కరువు, డాక్టర్ల పోస్టులు ఖాళీ
- కానరాని ల్యాబ్‌టెక్నీషియన్లు, సిబ్బంది కొరతతో ఇబ్బందులు
- దయనీయంగా ఆరోగ్య ఉపకేంద్రాలు
- ప్రహసనంగా మారిన పల్లె దవాఖానాలు
- ఏజెన్సీ ప్రాంతాల్లో దైన్యం
- దూరంగా పీహెచ్‌సీలు
- కొత్త పీహెచ్‌సీల ప్రతిపాదనలు బుట్టదాఖలు
- అన్ని ఆస్పత్రుల్లో తీవ్రంగా మందుల కొరత
- ఇబ్బందులు పడుతున్న గ్రామీణ రోగులు



వైద్యం మిథ్య!



వరంగల్ మెడికల్, జూన్ 22: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) వైద్యం అందని ద్రాక్షలా మారింది. అనేక సమస్యలతో కూనారిల్లుతున్న ఈ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద రోగులకు సరైన వైద్యాన్ని అందించలేక పోతున్నాయి. చేసేది లేక చివరకు వారు ప్రైవేటు ఆస్పత్రులను సందర్శించక తప్పడం లేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు పాలకులు పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటున్న వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. పీహెచ్‌సీల్లో డాక్టర్లతో పాటు వివిధ విభాగాల్లో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేసే విషయంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది.

డాక్టర్ల కొరత

ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల్లో పల్లె దవాఖానాలను నెలకొల్పినా పలుచోట్ల డాక్టర్లను నియమించలేదు. మహిళా, పురుష సమీకృత కార్య కర్తలు (ఎంపీహెచ్) పోస్టులు కూడా 40 శాతానికిపైగా ఖాళీగా ఉన్నాయి. ఒక్కో పీహెచ్‌సీలో ఇద్దర ప్రధాన వైద్యులను నియమించాల్సి ఉండగా, కొన్ని కేంద్రాల్లో ఒక్కొక్కరు మాత్రమే ఉన్నారు. దీంతో ఆర్‌బీఎస్‌కే నుంచి కొందరిని పల్లె దవాఖానాల్లో నియమించినా వారిని కూడా పీహెచ్‌సీలకు సర్దుబాటు చేస్తూ డిప్యూటేషన్‌పై పంపిస్తున్నారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొన్ని చోట్ల పూర్తిస్థాయి వైద్య సేవలు అందడం లేదు. పీహెచ్‌సీల్లో, పల్లె దవాఖానాల్లో, ఆరోగ్య ఉపకేంద్రాల్లో డాక్టర్ల లేకపోవడంతో రోగులు ఆ వైద్య కేంద్రాలకు వేళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. పీహెచ్‌సీల్లో ఒక్క డాక్టరే ఉండడంతో ఆయన సెలవు పెట్టినరోజు ఆ కేంద్రంలో రోగులకు వైద్య సేవలకే కూడా సెలవే. ఒక్కో పీహెచ్‌సీకి రోజుకు కనీసం 60 నుంచి 70 మంది రోజులు వస్తుంటారు. వారంతా పీహెచ్‌సీకి వచ్చి డాక్టర్ కోసం పడిగాపులు కాయడం, తీరా ఆ రోజు డాక్టర్ రావడం లేదని చెప్పడం నిరాశతో వెనుతిరిగి వెళ్లడం పరిపాటిగా మారింది.



ల్యాబ్ టెక్నీషియన్లు లేక..

ఉమ్మడి జిల్లాలో అనేక ల్యాబ్ టెక్నీషియన్ల (ఎల్‌టీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంలో కీలకమైన ల్యాబ్‌టెక్నీషియన్లు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగ నిర్ధారణ పరీక్షల కోసం ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో పేద రోగులు అక్కడ పెద్ద మొత్తంలో ఫీజులు చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నారు. పీహెచ్‌సీల్లో ఎల్‌టీలు లేకపోవడంతో రోగుల రక్త నమూనాలను అక్కడ ఉన్న ఇతర సిబ్బంది సేకరిస్తుండడం కనిపిస్తోంది.

అధ్వానంగా ఉప కేంద్రాలు

ఉమ్మడి జిల్లాలోని ఆరోగ్య ఉపకేంద్రాలు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఆరోగ్య ఉపకేంద్రాలను పల్లెదవాఖానాలుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావించినప్పటికీ అది పూర్తిస్థాయిలో ఆచరణలోకి రాలేదు. ఇంతకాలం ఎన్ఎన్ఎం, ఆశావర్కర్ల సేవలకు మాత్రమే పరిమితమైన ఈ కేంద్రాల్లో క్వాలిఫైడ్ డాక్టర్లను నియమించాలని నిర్ణయించినప్పటికీ ఇప్పటి వరకు ఆ దిశగా పెద్దగా అడుగులు పడలేదు. ఆరోగ్య ఉపకేంద్రాలకు రావడానికి క్వాలిఫైడ్ డాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆశించిన లక్ష్యం నెరవే రలేదు. ప్రతీ ఐదువేల జనాభాకు ఒకటి చొప్పున ఆరోగ్య ఉప కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో ఇద్దరు ఏఎన్ఎంలు, ప్రతీ వెయ్యి జనాభాకు ఒక ఆశావర్కర్ చొప్పున ఉండి ప్రభుత్వ వైద్యసేవలను, పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లాలి. అయితే ఈ ఉప కేంద్రాల్లో డాక్టర్ల లేని కారణంగా అవి

మిగతా 8వ పేజీలో..

ఏజెన్సీలో అందని వైద్యం

గిరిజన ప్రాంతాల్లో కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు కలగా మారింది. ఏజెన్సీ పరిధిలోని మండలాలు విస్తీర్ణపరంగా పెద్దగా ఉంటాయి. రవాణ సౌకర్యాలు తక్కువగా ఉంటాయి. మారుమూల ప్రాంతాల్లో పరిస్థితులు మరింత దయనీయంగా ఉంటాయి. వ్యాధులు ఎక్కువగా ప్రబలేది ఇక్కడే. వాస్తవంగా ఇక్కడ ఒక్కో ఏజెన్సీ మండలంలో విస్తీర్ణాన్ని బట్టి రెండేసి పీహెచ్‌సీలను ఏర్పాటు చేయాల్సి ఉండగా, కొన్నిచోట్ల ఒక్కటి కూడా సరిగా లేదు. దీంతో ములుగు జిల్లా పరిధిలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సేవలు అందని దుస్థితి నెలకొని ఉన్నది. ఏజెన్సీల్లో కొత్త పీహెచ్‌సీల ఏర్పాటుకు వైద్యాధికారులు ప్రతిపాదనలు పంపినప్పటికీ ఇప్పటి వరకు ఆమోదానికి నోచుకోలేదు.

మృత్యుఘోష

ఏజెన్సీలో తరుచూ శిశువులు, గర్భిణులు, బాలింతలు మృతి చెందుతున్న సంఘటనలు తరుచూ చోటుచేసుకుంటుండడంతో మారుమూల కొత్త పీహెచ్‌సీల ఏర్పాటు చర్చనీయాంశంగా మారింది. ఏజెన్సీ ఏరియాలోని పీహెచ్‌సీలు మండల కేంద్రాలకు 50 నుంచి 60 కి.మీ. దూరంలో గ్రామాలు ఉండడం, ఆయా గ్రామాలకు ఎటువంటి రోడ్డు సదుపాయం లేకపోవడంతో రోగులు చికిత్స కోసం ప్రయాస పడాల్సి వస్తోంది. ఆయా ప్రాంతాల్లోని గిరిజనులకు ఎటువంటి ఆనారోగ్య సమస్యలు వచ్చినా సకాలంలో వైద్య సేవలు అందని పరిస్థితి. దీంతో రోగులు, గర్భిణులను మంచాల్లో మోసుకొని రావల్సి వస్తున్నది. ఈ క్రమంలో తల్లీ లేదా బిడ్డ ప్రాణాలు పోతున్న ఉదంతాలు కూడా అడపాదడపా చోటు చేసుకుంటున్నాయి. విస్తీర్ణపరంగా అధికంగా ఉన్న గిరిజన ప్రాంతాల్లో కొత్తగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాత ఆరోగ్య ఉపకేంద్రాలను పునర్విభజన చేయాల్సిన అసవరం ఉందని డాక్టర్లు అభిప్రాపడుతున్నారు.



ఎంజీఎంలో రోగి బంధువులతో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగించాలి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్

వరంగల్ మెడికల్, జూన్ 22: ప్రభుత్వ ఆస్పత్రిలో కల్పిస్తున్న వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసం కల్పించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ కోరారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిని హుస్సేన్‌నాయక్ శనివారం సందర్శించారు. వార్డులను పరిశీలించి, రోగులతో మాట్లాడారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య కార్యక్రమాన్ని మెరుగుపర్చాలని, రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులను నియమించాలన్నారు. ఎంజీఎంలో 1,700 పడకలు ఉండగా, కేవలం 22 ఐసీయూ పడకలు మాత్రమే ఉండటంపై విచారం వ్యక్తం చేశారు. ఆస్పత్రుల్లో పనిభారం ఎక్కువగా ఉందని, నలుగురు చేసే పని ఒక్కరే చేస్తున్నట్టు గుర్తించామన్నారు. అనంతరం ఎంజీఎంలోని సూపరింటెండెంట్ చాంబర్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి, కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మోహన్‌దాస్, ఎంజీఎం ఆస్ప త్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, వైద్యులు పాల్గొన్నారు.

రుణమాఫీతో 78,432 రైతులకు లబ్ధి

- డీసీసీ బ్యాంకు పరిధిలో మొత్తంగా రూ.529.44కోట్ల మాఫీ
- మీడియా సమావేశంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూన్ 22: రాష్ట్ర ప్రభుత్వం ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయడం ద్వారా వరంగల్ ఉమ్మడి జిల్లాలో డీసీసీ బ్యాంకు పరిధిలో 78,432 రైతులకు లబ్ధి చేకూరనున్నట్లు తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు వెల్లడించారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో రుణమాఫీ, లబ్ధి పొందే రైతుల వివరాలను తెలియచేశారు. డీసీసీ పరిధిలోని బ్రాంచిలు, సహకార సంఘాల నుంచి రుణాలు తీసుకున్న రైతులకు ప్రభుత్వ నిర్ణయం ద్వారా గొప్ప ఆర్థిక ప్రయోజనం చేకూరనుందన్నారు. ప్రభుత్వ ఆదే శాలు, నిబంధనల మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీసీసీ బ్యాంకు ద్వారా రుణమాఫీ కలిగే రైతుల వివరాలతో కూడిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందచేసినట్లు చెప్పారు. ఈ విషయంలో పూర్తి పారదర్శక తతో వ్యవహరించినట్లు చెప్పారు. రుణమాఫీ, రైతుల వివరాల గురించి సందేహాలు ఉన్నట్లైతే రైతు, సహకా ర సంఘాలు తమ ద్వారా నివృత్తి చేసుకోవచ్చని సూచించారు.

డీసీసీ బ్యాంకు, సహకార సంఘాల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రుణాలు తీసుకున్న రైతుల్లో 7లక్షల 75వేల మంది రైతులకు ఆర్థిక ప్రయోజనం కలగనుందని చెప్పారు. రూ.5048.01 కోట్ల రుణమాఫీ జరగనుందని వివరించారు. కేవలం డీసీసీ బ్యాంకులు, సహకార సంఘాల నుంచి రుణాల పొందిన రైతుల రుణాల మాఫీయే ఇంత పెద్ద మొత్తంలో ఉంటే.. ఇక వాణిజ్య ఇతర బ్యాంకుల నుంచి తీసుకున్న రైతులు భారీ మొత్తంలో ఉంటుందన్నారు.

ఇంతటి వ్యయభారాన్ని సైతం లెక్క చేయకుండా రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉండడం అభినందనీయమన్నారు. దేశ చరిత్రలోనే రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి ముఖ్యమంత్రిగా చిరస్థాయిలో నిలిచిపోతారని కొనియాడారు. గత ప్రభుత్వం దశల వారిగా రుణమాఫీ నిర్ణయాలు ప్రకటిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయడం సాహసోపేతమైనదిగా అభివర్ణించారు.రుణమాఫీ విషయంలో ప్రతిపక్షాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నోరు పారేసుకున్నాయని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయంతో రైతులే వారికి గుణపాఠం చెప్పనున్నారని రవీందర్‌రావు పేర్కొన్నారు. సమావేశంలో డీసీసీ బ్యాంకు డైరెక్టర్ హరిప్రసాద్, డైరెక్టర్లు నర్సింగారావు, నరేందర్, మురళీధర్, రవితేజ, జగన్‌మోహన్, యాదగిరిరెడ్డి, డీసీసీ బ్యాంక్ సీఈవో మహ్మద్ వాజిద్ సుల్తాన్, సీపీవోలు రోహిణి, దమయంతి, కురువనాయక్, రాజశేఖర్, నవీన్, కల్యాణి, రాధిక, అశోక్, మధుసుదన్, స్రవంతి, కృష్ణమోహన్, రాజు, బ్యాంక్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసే నిర్ణయాన్ని తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, డీసీసీ బ్యాంకు డెరెక్టర్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. శుక్రవారం హనుమకొండలోని డీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయం ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ధరల మంట

- భగ్గుమంటున్న కూరగాయలు
- పప్పుల ధరలూ పైపైకి..
- బెంబేలెత్తుతున్న సామాన్యులు

నర్సంపేట, జూన్ 22 : నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పదిహేను రోజులుగా కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. వీటికి తోడుగా పప్పుదినుసుల రేట్లూ పెరిగి పోతున్నాయి. కిలో కందిపప్పు రూ.190, కిలో పెసరపప్పు రూ.120, బొబ్బెరపప్పు రూ.120, మినప పప్పు రూ.145, శనగపప్పు రూ.90, మైసూర్ పప్పు రూ.100 వరకు పలుకుతోంది. పప్పులు, కూరగాయల ధరలు పెరిగిపోవడంతో పచ్చడిమెతుకులతో కడుపునింపు కోవాల్సి వస్తుందని సామాన్యులు బెంబేలెత్తి పోతున్నారు. వేసవిలో నీటికొరతతో కూరగాయల సాగు తగ్గింది. ఎండ దెబ్బకు పంటలు దెబ్బతినడం, ట్రాన్స్‌పోర్టు చార్జీలు పెరగడంతో నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలపై ప్రభావం చూపుతోంది. జిల్లాలోని అన్ని ప్రాంతాలలో ధరలు ఆకాశానంటాయి. ఏ కూరగాయలైనా కిలో రూ.60 నుంచి రూ.100 పలుకుతున్నాయి. గత కొద్దినెలల క్రితం కురిసిన అకాల వర్షాలు వల్ల ఉద్యానవన పంటలు దెబ్బతిని దిగుబడి తగ్గడం, ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆశించిన మేరకు కూరగాయల దిగుబడి రాకపోవడంతో నిత్యావసర సరుకుల ధరలు మండిపోతున్నాయి. కూరగాయల ధరలు పెరిగిపోవడంతో రోజువారీ కూలీ నాలి చేసుకొని జీవించే కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది.



కూరగాయల ధరలు

రకం	కిలో
టమాట	రూ.80-రూ.100,
బీరకాయ	రూ.100
బెండకాయ	రూ.60
దొండకాయ	రూ.60-రూ.70
కాకరకాయ	రూ.80-రూ.100,
వంకాయ	రూ.50 -రూ.60
క్యారట్	రూ.100
క్యాప్సికమ్	రూ.80
పచ్చిమిర్చి	రూ.100-రూ.120
గోరుచిక్కుడు	రూ.60
బీట్‌రూట్	రూ.70 -రూ.80





నర్సంపేట మార్కెట్‌లో కూరగాయల అమ్మకాలు

రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం పదోన్నతులు కల్పించాలి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్



హనుమకొండలోని విద్యుత్ భవన్‌లో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

హనుమకొండ టౌన్, జూన్ 22: గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం పదోన్నతులు కల్పించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ సూచించారు. శనివారం నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో గిరిజన విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డితో హుస్సేన్‌నాయక్ ప్రత్యేకంగా సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా లైజనింగ్ ఆఫీసర్‌ను నియమించి, ఎస్టీ సెల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన ఉద్యోగులపై ఉన్న 20 డీసీ కేసులపై సమీక్ష జరిపి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్స్ మోహన్‌రావు, అశోక్, సదర్‌లాల్, గిరిజన విద్యుత్ ఉద్యోగుల అసోసియేషన్ కంపెనీ అధ్యక్షుడు భూక్య వాలునాయక్, అజ్మీర శ్రీరామ్‌నాయక్, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు బి.రాజశేఖర్, కేబీ రాజేందర్, స్వామినాయక్, తదితరులు పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో ఎస్టీ కేసులపై సమీక్ష

వరంగల్ క్రైం: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ శనివారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయానికి వచ్చారు. అదనపు డీసీపీ రవి కమిషన్ సభ్యుడికి స్వాగతం పలికారు. అనంతరం కమిషనరేట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఎస్టీ పెండింగ్ కేసుల వివరాలు, బాధితులకు అందించాల్సిన నష్టపరిహారానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని హుస్సేన్ నాయక్ సూచించారు.

మహదేవపూర్ సీఐపై బదిలీ వేటు

మహదేవపూర్ రూరల్, జూన్ 22: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ సీఐ రాజేశ్వరరావుపై బదిలీ వేటు పడింది. ఈ మేరకు మల్టీ జోన్-1 ఐజీ రంగనాథ్ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రతిని ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. రెండు నెలల కిందట మహదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో ఓ ప్రజాప్రతినిధి డ్యాన్స్ చేసిన సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. సందర్భంలో విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ సస్పెండ్ చేయడంతో పాటు ఎస్సై ప్రసాద్‌ను వీఆర్‌కు బదిలీ చేయడం రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. మహిళా కానిస్టేబుల్‌పై లైంగిక దాడి కేసులో రెండు రోజుల కిందట కాళేశ్వరం ఎస్సై భవానీ సేన్ అరెస్టు డిస్మస్ అయ్యాడు. ఈరెండు ఘటనలు రెండునెలల వ్యవధిలో ఒకే సర్కిల్ పరిధిలో చోటు చేసుకోవడంతో పర్యవేక్షణ అధికారిగా ఉన్న మహదేవపూర్ సీఐ రాజేశ్వర్‌రావుపై బదిలీ వేటు పడినట్లు తెలుస్తోంది. వరుసగా సంఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో సమర్థంగా విధులు నిర్వర్తించే అధికారికి బాధ్యతలు అప్పగించాలని ఉద్దేశంతో సీఐ రాజేశ్వరరారవును బదిలీ చేసినట్టు తెలుస్తోంది.

ప్రస్తుతం ఆయన స్థానంలో కొత్తవారికి బాధ్యతలు అప్పగించకపోవడంతో పోస్టింగ్ కోసం పలువురు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. గతంలో కాళేశ్వరం, మహదేవపూర్ పీఎస్‌లలో ఎస్సైలుగా పనిచేసి సీఐగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్లిన అధికారులు.. మళ్లీ మహదేవపూర్ సర్కిల్‌లోనే పోస్టింగ్ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. వీరితో మరో ఇద్దరు ఇదే సర్కిల్‌లో పోస్టింగ్ కోసం స్థానిక రాజకీయ నాయకుల సహకారంతో ఉప ముఖ్యమంత్రి వద్ద పైరవీ చేస్తున్నట్లు సమాచారం.


విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరిస్తున్న పాలిసెట్ జిల్లా కన్వీనర్ డాక్టర్ బైరి ప్రభాకర్

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం


వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 22: పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమైంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్ హెల్ప్‌లైన్ సెంటర్‌లో పాలిసెట్ వరంగల్ జిల్లా కన్వీనర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ శనివారం ప్రారంభించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మొదటి రోజు మొత్తం 480 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించినట్లు డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. కాగా, వెయ్యిలోపు ర్యాంకులు సాధించిన 15 మంది విద్యార్థుల తల్లిదండ్రులను కౌన్సెలింగ్ సెంటర్‌లో కన్వీనర్ డాక్టర్ ప్రభాకర్ శాలువాతో సత్కరించారు. విద్యార్థుల లక్ష్యసాధనకు అన్ని విధాలా సహకారాలు అందిస్తున్న తల్లిదండ్రులను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. తమ పిల్లల పట్ల తల్లిదండ్రులు చూపిస్తున్న శ్రద్ధకు గౌరవంగా తాము ఈ సత్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలిగినా తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

డొల్ల కంపెనీల పేరిట మోసం

● జాబ్ గ్యారంటీ పేరిట వసూళ్లు ● డైరెక్టర్లుగా అవకాశం ఇస్తానని దగా ● దిక్కుతోచని స్థితిలో బాధితులు

వరంగల్ క్రైం, జూన్ 22: డొల్ల కంపెనీలు పెట్టి నిరుద్యోగులను మోసం చేసిన ఘటన హనుమకొండలో చోటు చేసుకుంది. లేని కంపెనీలు ఉన్నట్లు పేపర్ల మీద సృష్టించి లక్షలు దండుకుని తప్పించుకుని తిరుగుతున్నాడు ఓ ప్రబుద్ధుడు. సదరు మాయలోడు చేసిన మోసంతో పలువురు నిరుద్యోగులు రోడ్డున పడ్డారు. అతడు చెప్పిన మాయమాటలు నమ్మిన బాధితులు లక్షలు పోగొట్టుకుని ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..

హనుమకొండలోని ఒక ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఒక వ్యక్తి.. 2017లో హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలు ప్రారంభించాడు. ఈ క్రమంలో 2020లో ఎథిరాం ప్రైవేటు లిమిటెడ్ కంపెనీని ప్రారంభించి వరంగల్ నగరంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రెయినింగ్ సెంటర్ ప్రారంభించాడు. స్థానికుల సహకారంతో మడికొండ ఐటీ సెక్టార్‌లో కొంత ప్రభుత్వ స్థలం తీసుకున్నాడు. జాబ్ గ్యారంటీ పేరిట ట్రెయినింగ్ ప్రారంభించి ఒక్కొక్కరి వద్ద రూ.2లక్షలకు పైగా వసూలు చేశాడు. ఇలా.. దాదాపు 100 మంది వద్ద డబ్బులు తీసుకన్నట్లు బాధితులు తెలిపారు. ట్రెయినింగ్ పూర్తి అయిన తర్వాత నిరుద్యోగులు ఉద్యోగాలపై నిలదీస్తే తప్పించుకుతిరిగాడు. దీంతో కంపెనీ నిర్వాహకుడిని విద్యార్థులు నిలదీశారు. ఈ విషయమై ఇంజనీరింగ్ కళాశాల ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో నిర్వాహకుడిని ప్రశ్నించారు. కేసు పెడుతామని హెచ్చరించడంతో చెప్పా పెట్టకుండా రాత్రికి రాత్రి బోర్డు తిప్పేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. కంపెనీలన్నీ పేపర్లమీదనే ఉన్నట్లు గ్రహించిన బాధితులు.. మోసపోయినట్లు గ్రహించి నిర్వాహకుడి కోసం వెతికినా ఫలితం లేకుండాపోయిందని వాపోతున్నారు. అయితే హైదరాబాద్‌లో వెతికిపట్టుకున్న కొందరు విద్యార్థులను బెదిరించినట్లు సమాచారం. డబ్బులు పోగొట్టుకున్న బాధితులు వారి పేరు చెప్పేందుకు సైతం జంకుతున్నారంటే నిర్వాహకుడు ఏ స్థాయిలో బెదిరింపులకు గురిచేస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు.



భాగస్వామ్యం ఇస్తానని మోసం

ఎథిరాం ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ నిర్వాహకుడు ట్రెయినింగ్‌ల పేరిట నిరుద్యోగులను మోసం చేయడంతోపాటు డైరెక్టర్లుగా అవకాశం ఇస్తానని పలువురిని మోసం చేసినట్లు తెలిసింది. పొరుగు దేశంలో ఉన్న స్నేహితుడి వద్ద రూ.25లక్షలు తీసుకున్న సదరు కంపెనీ నిర్వాహకుడు.. మరొకరిని ఇండియాకు పిలిపించి మోసం చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇండియాకు వచ్చిన మరో బాధితుడి నుంచి రూ.15లక్షలు తీసుకుని డైరెక్టర్ చేస్తానని మోసం చేయడంతో పాటు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వలేదని బాధితుడు తెలిపాడు. బాధితుడు ప్రస్తుతం హైదరాబాద్‌లో ఒక షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. పొరుగు దేశంలో ఉన్న బాధితుడు హైదరాబాద్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితులు తెలిపారు. హనుమకొండకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి ఒకరు తన కుమారుడికి ఎథిరాం కంపెనీలో డైరెక్టర్ అవకాశం ఇస్తానంటే రూ.1కోటి వరకు నిర్వాహకుడికి ఇచ్చాడు. ఈ విషయాన్ని స్వయంగా ప్రభుత్వ ఉద్యోగి తెలిపాడు. ఇలాగే మరో ముగ్గురి వద్ద రూ.15లక్షల చొప్పున తీసుకుని సంవత్సరంలో కోటి ఇస్తానని, నెలనెల రూ.1లక్ష వేతనం ఇస్తానని మోసం చేసినట్లు బాధితులు తెలిపారు. తన వద్ద పనిచేసే ఉద్యోగులకు సైతం వేతనాలు ఇచ్చేవాడు కాదనే విమర్శలున్నాయి. సదరు నిర్వాహకుడిపై బాధితులు ఇండస్ట్రీస్ ప్రిన్సిపల్ సెక్రెటరీకి, జిల్లా జనరల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు.

జాబ్ గ్యారంటీ అని మోసం చేశాడు..

ఎన్.రాహుల్, బాధితుడు



జాబ్ గ్యారంటీ అంటే శిక్షణ కోసం రూ.1లక్ష 50వేల చెల్లించాను. శిక్షణ కూడా ఏమి ఇవ్వలేదు. శిక్షణ కోసం లెక్చరర్స్ కూడా లేరు. మమ్మల్ని యూట్యూబ్‌లో చూసుకుని నేర్చుకోండి అనేవాడు. తొమ్మిది మాసాలు జాబ్ వస్తుందనే ఆశతో టీచింగ్ లేని శిక్షణలో పాల్గొన్నాం. తీరా జాబ్ గురించి ప్రశ్నించే సమయంలో బోర్డు తిప్పేసి వెళ్లాడు. డబ్బులు వసూలు చేసుకునేందుకు ప్రయత్నించాం. ఫలితం లేకుండా పోయింది. జాబ్ కోసం వచ్చి డబ్బులు పోగొట్టుకున్నాం. అతడి జాడ కోసం వెతుకుతున్నాను.

కంటెంట్ తీసుకుని మోసం చేశాడు..

కె.సంతోష్, బాధితుడు



మోసపూరిత మాటలు చెప్పి నేను తయారు చేసిన ఒక సంస్థకు సంబంధించిన కంటెంట్ తీసుకున్నాడు. ఒక సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్ తీసుకున్నాడు. నా సర్వీసు తీసుకుని మోసం చేశాడు. అతడి వల్ల రూ.15లక్షలకు పైగా నష్టపోయా. డబ్బులు అడిగితే అనుచరుడితో బెదిరింపులకు పాల్పడుతున్నాడు. లీగల్ నోటీసు ఇచ్చినా, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. అతడిపై పోలీసులు చర్యలు తీసుకోవాలి.

ప్రైవేటు ఫిర్యాదులు వచ్చాయి..

ఆర్.సంతోష్‌కుమార్, టీఎస్ఐఐసీ, జోనల్ మేనేజర్

ఎథిరాం ప్రైవేటు లిమిలెడ్ కంపెనీకి స్థలం కేటాయించాం. కిందటేడు భవనం పూర్తి చేయాల్సి ఉండగా, గడువు కోరితే మరో సంవత్సరం ఇచ్చాం. ఈ యేడు నెలాఖరులోగా పూర్తి చేయకుంటే నోటీసు ఇచ్చి కేటాయించిన స్థలం రద్దు చేస్తాం. సంస్థ నిర్వాహకుడిపై ప్రైవేటు ఫిర్యాదులు వచ్చాయి. నిర్వాహకుడుకి డబ్బులు ఇచ్చామని, భాగస్వామ్యం ఇస్తానని ఇవ్వలేదని, జాబ్ ఇస్తానని డబ్బులు తీసుకుని మోసం చేశాడని ఫిర్యాదు వచ్చాయి. అవి ప్రైవేటు ఫిర్యాదులు.. మా పరిధిలోవి కావు. కొంతమంది కంపెనీ వివరాలు ఆర్టీఏ కింద కోరితే అందించాం. నిబంధనలు విస్మరిస్తే సదరు నిర్వాహకుడిపై చర్యలు తీసుకుంటాం.

విద్యుత్ పోల్ ఎక్కే పరీక్షకు 12 మంది హాజరు

హనుమకొండ టౌన్, జూన్22: జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) నియామకాల్లో భాగంగా శనివారం హనుమకొండ ములుగురోడ్డులోని నార్తర్న్ పవర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌పీటీఐ)లో 7వ సారి నిర్వహించిన విద్యుత్ స్తంభం ఎక్కే పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి 16 మందికిగానూ 12 మంది హాజరైనట్లు హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ తెలిపారు. డైరెక్టర్ మోహన్‌రావు, వరంగల్ ఎస్ఈ మధుసూదన్‌రావు, టెక్నికల్ డీఈ ఆనందం, ఎన్‌పీటీఐ డీఈ రాజేందర్ పర్యవేక్షణలో వీడియోగ్రఫీ మధ్య పరీక్ష ముగిసింది. కాగా, కమిటీ ఎంపిక చేసిన అభ్యర్థుల పేర్లను హనుమకొండ ఎస్ఈ కార్యాలయంలో ప్రదర్శించనున్నట్లు ఎస్ఈ తెలిపారు.

మానుకోటలో యువకుడి అదృశ్యం


పొడకంటి రంజిత్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, జూన్ 22 : మహబూబాబాద్ జిల్లా కేంద్రం భవానినగర్‌లో ఈ నెల 10వ తేదీన పొడకంటి రంజిత్ అనే యువకుడు అదృశ్యమయ్యాడని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. హనుమకొండ 57వ డివిజన్ సమ్మయ్యనగర్‌కు చెందిన పొడకంటి వెంకటేశ్వర్లుకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తెను మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి కొన్నేళ్ల క్రితం వివాహం జరిపించగా ఈ నెల 10న ఆమె గుండెజబ్బుతో మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు చిన్న కొడుకు పొడకంటి రంజిత్‌ను తీసుకుని కుటుంబసభ్యులు మహబూబాబాద్‌కు చేరుకున్నారు. అంత్యక్రియల అనంతరం సాయంత్రం కిరాణషాపుకు వెళ్లి వస్తానని చెప్పిన రంజిత్ రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో వారు బంధువుల ఇండ్లలో వాకబు చేశారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో ఈ నెల 11న తండ్రి వెంకటేశ్వర్లు మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ దేవేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వర్సిటీ నిబంధనలు పాటించిన కళాశాలలకే గుర్తింపు

కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి

వర్సిటీ అనుబంధ కళాశాల ప్రిన్సిపాళ్లతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్, జూన్ 22: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో యూజీసీ నిబంధనల మేరకు నడుచుకునే కళాశాలలకే వర్సిటీ అనుబంధ గుర్తింపును కొనసాగిస్తామని, నిబంధనలు పాటించని కళాశాలల గుర్తింపు రద్దు చేస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి స్పష్టంచేశారు. వర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్ల సమావేశం శనివారం కేయూ సెనెట్ హాల్‌లో జరిగింది. కేయూ అకడమిక్ ఆడిట్ డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ మల్లారెడ్డి పాల్గొని మాట్లాడారు. వర్సిటీ అనుబంధ కళాశాలలన్నీ బలోపేతం అయినప్పుడే వర్సిటీకి పేరు ప్రఖ్యాతులు వస్తాయని అన్నారు. వర్సిటీ పరిధిలోని కళాశాలలను ఆకస్మికంగా తనిఖీలు చేస్తామని చెప్పారు. కొత్త కోర్సులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను, సేవలను అందించాలని సూచించారు. బోధన, శిక్షణ, పరిశోధనపై దృష్టి సారించాలని కోరారు. వర్సిటీ ఎంపిక చేసిన ప్రభుత్వ కళాశాలలను పరిశోధన కేంద్రాలుగా అనుమతులు ఇచ్చామన్నారు. ఆటానమస్ పొందిన కళాశాలల పరీక్షల ఫలితాలను ఆడిట్ చేస్తామని వెల్లడించారు. అనేక సమస్యలున్నప్పటికీ పరీక్షల నిర్వహణ పక్బందీగా నిర్వహించి ఫలితాలను సరైన సమయంలో విడుదల చేస్తున్నామని, పేర్కొన్నారు. ప్రభుత్వ అధ్యాపకులు పేపర్ వాల్యూవేషన్‌కు రావాలని కోరారు. వర్సిటీ కింద 297 కళాశాలుండగా, 197 కళాశాల బోధన సిబ్బందిని వర్సిటీ పోర్టల్‌లో నమోదు చేశారని వివరించారు.

డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు మాట్లాడుతూ.. జూన్ 10 నుంచి డిగ్రీ 3, 5వ సెమిస్టర్ క్లాస్‌లు ప్రారంభించినట్లు తెలిపారు. జూలై 1 నుంచి దోస్త్ మేరకు 1వ సెమిస్టర్ క్లాస్‌లు ప్రారంభమవుతాయని వెల్లడించారు. కళాశాలలు వర్సిటీ ఫీజులు చెల్లించాలని, అధ్యాపకుల రాటిఫికేషన్ చేయించుకోవాలని కోరారు. వర్సిటీ ఆదేశాల మేరకు రికార్డులన్నీ పకడ్బందీగా నిర్వహించాలని, ల్యాబ్ చేయించాలని చెప్పారు. పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి మాట్లాడుతూ.. పరీక్షల నిబంధనలు పాటించాలని, అంతర్గత పరీక్షల, ప్రయోగ పరీక్షలు కచ్చితంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. మాల్‌ప్రాక్టీస్ కేసుల వివరాలను ఎప్పటికప్పుడు ప్రిన్సిపాళ్లు పరీక్షల విభాగానికి తెలియజేయాలని చెప్పారు. ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు పరీక్షల ప్రమోషన్, మాల్‌ప్రాక్టీస్, చాలెంజ్ వాల్యూవేషన్, వాల్యూవేషన్‌తో పాటు బకెట్ సిస్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే పరీక్షల విభాగానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడూ విద్యార్థులకు తెలియజేయాలని చెప్పారు. కేయూ ఎన్ఎస్ఎస్ సమన్వయ అధికారి ప్రొఫెసర్ ఈసం నారాయణ మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ యూనిట్లను మైభారత్ పోర్టల్‌లో నమోదు చేయాలని చెప్పారు. వర్సిటీ పరిధిలో 356 యూనిట్లు సక్రమంగా బ్యాంకు అకౌంట్లను నిర్వహిస్తున్నాయని, మిగతా 77 సక్రమంగా పనిచేయాలని చెప్పారు. కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు స్పోర్ట్స్ ఫీజులు చెల్లిస్తున్నప్పటికీ క్రీడల్లో పాల్గొనడం లేదని అన్నారు. 297 కళాశాలల్లో కేవలం 10/15 కళాశాల విద్యార్థులే స్పోర్ట్స్‌లో పాల్గొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అల్మానాక్ మేరకు కళాశాలలు క్రీడలు నిర్వహించాలని, క్రీడా అధ్యాపకులను నియమించాలని అన్నారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్స్ పలు సందేహాలను వర్సిటీ అధికారులకు విన్నవించారు. ప్రధానంగా 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు నిర్వహించాలని, అతిథి అధ్యాపకుల ఉత్తర్వులు సక్రమంగా ఇవ్వాలని, అల్మానాక్‌లో గ్యాప్ లేకుండా చూడాలని కోరారు. పరీక్షల విభాగం సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయాలని కోరారు. పరీక్షల విభాగంలో హెల్ప్‌లైన్ నెంబర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వర్సిటీకి, కాలేజీయేట్ కమిషనరేట్ ఉన్నతాధికారులు సమన్వయం చేసుకోవాలని కోరారు. కేయూ అకడమిక్ విభాగం ఏఆర్ డాక్టర్ కోలా శంకర్ మాట్లాడుతూ.. కళాశాల ప్రారంభమైన 15 రోజుల్లో రీఅడ్మిషన్ పొందాలని చెప్పారు. ఈ సమావేశంలో పీఆర్‌వో డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ వందన సమర్పణ చేయగా, ఏఆర్‌లు హబీబుద్దీన్, ఆర్‌వీ, తొర్రూరు, పరకాల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు డాక్టర్ బొలగాని రాములు, డాక్టర్ కొప్పుల మల్లేశం, డాక్టర్ హరిప్రసాద్, డాక్టర్ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నోట్ పుస్తకాల పంపిణీ

వరంగల్ చౌరస్తా, జూన్ 22: ఏవీవీ విద్యా సంస్థలో ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులకు వేమిశెట్టి శ్రీనివాస్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు శనివారం ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. 8 దశాబ్దాలుగా విద్యా బోధన చేస్తున్న ఏవీవీ సంస్థలో విద్యార్థులకు రూ.40వేల విలువ చేసే నోట్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు కుటుంబ సభ్యులు పారిజాతం, ఆద్య, శ్యామ్ తెలిపారు. కార్యక్రమంలో వీరేశలింగం, చందా శ్రీకాంత్, భుజేందర్‌రెడ్డి, వాసుదవ్‌లు, సంధ్యారాణి, భాగ్యలక్ష్మి, సుధారాణి, రమాదేవి, లాజరస్, భాస్కర్ పాల్గొన్నారు.


నోట్ బుక్కులు పంపిణీ చేసిన దాతలు

మంత్రిని కలిసిన చాంబర్ ప్రతినిధులు


మంత్రి సురేఖను కలిసి సమస్యలు వివరించిన ప్రతినిధులు

వరంగల్ సిటీ, జూన్ 22 : వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి అధ్యక్షతన చాంబర్ ప్రతినిధుల బృందం శనివారం హైదరాబాద్‌లో అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో పేరుకుపోయిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి వెంటనే మార్కెటింగ్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, జాయింట్ సెక్రటరీ సాగర్ల శ్రీనివాస్, అడ్తి సెక్షన్ అధ్యక్షుడు ఎస్‌రెడ్డి లింగారెడ్డి, కాటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చింతపల్లి వీరారావు, కోల్డ్ స్టోరేజీ సెక్షన్ అధ్యక్షుడు కంభంపాటి శ్రీధర్ పాల్గొన్నారు.

'ప్రజా సేవను అదృష్టంగా భావిస్తా'


అనిల్‌కుమార్‌ను సత్కరిస్తున్న క్లబ్ బాధ్యులు

శంభునిపేట, జూన్ 22 : ప్రజా సేవను అదృష్టంగా భావిస్తానని లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ వారియర్స్ అధ్యక్షుడు శేర్ల అనిల్‌కుమార్ అన్నారు. రంగశాయిపేటలోని ఓ ప్రైవేటు హైస్కూల్‌లో శనివారం క్లబ్ 5వ వార్షికోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడి అనిల్ కుమార్, సెక్రెటరీ కందికొండ కుమారస్వామి, కోశాధికారి సీహెచ్.సత్యనారాయణ, సభ్యులను క్లబ్ బాధ్యులు డాక్టర్ సురేష్, చంద్రశేఖర్ ఆర్యాలు ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో లయన్ ఎన్.వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ చంద్రశేఖర్ ఆర్యా, ఎన్.సుధాకర్‌రెడ్డి, జి.సురేష్‌కుమార్, కె.సుభాష్, హబీబ్, నివేదితరెడ్డి, డాక్టర్ జి.రాము, మాజీ అధ్యక్షుడు ఆకారపు రాజగోపాల్, చందా మనోహర్, లయన్ బరుపాటి రవి, ఎమ్డీ.యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ


మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న మధు

మట్టెవాడ, జూన్ 22 : ఆర్యవైశ్య సంఘం నాయకుడు, వ్యాపారి పుల్లూరి మధు ఆధ్వర్యంలో పేద మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. శనివారం పాపయ్యపేట చమన్ వద్ద 11 మంది పేద మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ అందజేశారు. కార్యక్రమంలో వరంగల్ ఆర్యవైశ్య సత్రం అధ్యక్షుడు, ఆర్యవైశ్య జాతీయ నాయకులు గట్టు మహేష్‌బాబు, వన్నాల శైలజ, గట్టు అరవింద్, పుల్లూరి వంశీ, బీజేపీ నాయకులు సిద్దం నరేష్, సయ్యద్ హైమద్, ముజీబ్, సలీం, కరీం పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సౌజన్య

గీసుగొండ, జూన్ 22: రైతులకు ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని కేబినెట్ ఆమోదం తెలిపినందుకు హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శనివారం కొనాయిమాకులలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు చెరుకుపల్లి సాంబరెడ్డి, వజ్ర రాజు, రహీంపాషా, కొమ్ము శ్రీకాంత్, ఆకుల రుద్రప్రసాద్, దూలం వెంకటేశ్వర్లు, వరిగెల రాజు, పత్తిపాక రవీందర్, నరసింహరావు, బాదావత్ రమేష్, ఉపేందర్, నాగరాజు, రాజ్‌కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

సంగెంలో..


సంగెంలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సంగెం : రూ.2 లక్షల రుణమాఫీకి క్యాబినేట్ ఆమోదం పొందడంతో శనివారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కందగట్ల కళావతినరహరి, మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, పరకాల అధికార ప్రతినిధి జనగాం రమేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, నాయకులు గుమ్మడి హరిబాబు, గూడ సంపత్‌రెడ్డి, ఎంపీటీసీలు గుగులోత్ వీరమ్మ, కట్ల సుమలతనరేష్, చిదురాల రజిత రాజు, ఆగపాటి రాజు, సంధ్య, రాజ్‌కుమార్, పాషా పాల్గొన్నారు.

రైతులు విపత్తుల బారిన పడకుండా చూసుకోవాలి

రాయపర్తి, జూన్ 22 : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో భాగంగా రైతులు విపత్తుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారిణి ఉషాదయాల్, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావులు సూచించారు. శనివారం మండలకేంద్రంలో ఎన్డీఆర్ఎఫ్ ఫామెక్స్‌లో భాగంగా రైతువేదికలో ఎన్డీఆర్ఎఫ్ టెన్త్ బెటాలియన్ సభ్యుల కమ్యూనిటీ అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకు ముందు వ్యవసాయ అధికారులు, జాతీయ ఆహార భద్రత మిషన్ కన్సల్టెంట్ పి.సారంగంతో కలిసి మండలంలోని మొరిపిరాల, రాగన్నగూడెం, జ్యోతిరాం తండాల్లోని వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వలన కలిగే వరదలు, పిడుగుల నుండి పాడిపశువులను సంరక్షించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏడీఏ సురేష్, ఏవో వీరభద్రం, ఎస్ఐ సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

నగరంలో పెరుగుతున్న చోరీలు

- సొత్తు రికవరీలో పోలీసులకు తలనొప్పి
- నగరవాసులు అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

మట్టెవాడ, జూన్ 22 : నగరంలో దొంగతనాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. సొత్తు, వాహనాలు, నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురై బాధితులు అల్లాడుతున్నారు. రోజుకోచోట దొంగతనం జరుగుతుండడంతో పోలీసులకు తలనొప్పిగా మారింది. సమాచారం అందగానే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూలు సేకరిస్తూ నిందితులను పట్టుకుని కటకటాల్లోకి నెట్టుతున్నారు. ఒక చోరీ కేసును చేధించడంకోసం పోలీసుశాఖలోని అన్నివిభాగాలు సమన్వయంతో పనిచేయడంతో దొంగలను పట్టుకోవడం, సొత్తు, వాహనాలు, నగదు పూర్తి స్థాయిలో రికవరీ సాధ్యమవుతోందని పోలీసులు పేర్కొంటున్నారు. దొంగలను పట్టుకోవడం ఒక ఎత్తయితే, సొత్తు రికవరీ మరో ఎత్తని చెబుతున్నారు. నేరగాళ్లు దొంగతనాలకు పాల్పడిన వెంటనే ఇతర రాష్ట్రాలు వెళ్తుండడంతో నిందితులను పట్టుకోవడం కష్టం మారుతోందని వాపోతున్నారు. నిందితులు ఎక్కువగా కర్ణాటక, మహారాష్ట్ర, ముంబాయి, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్‌లో చోరీ సొత్తును విక్రయిస్తున్నారు. దీంతో నిందితులు దొరికినా రికవరీ పూర్తిస్థాయిలో సాధ్యం కావడం లేదు. చోరీ సొత్తు విక్రయించే ప్రాంతాలను నిందితులు చూపుతున్నా, దాన్ని కొనుగోలు చేసిన వారు తిరిగి ఇవ్వడంలో అనేకమెలికలు పెడుతుంటారు. ఇది పోలీసులు ఇబ్బందిగా మారుతోంది. మరోపక్క నిందితులను అరెస్టు చేసిన 24గంటలకు మించి కస్టడిలో పెట్టుకునే అధికారం చట్టప్రకారం లేకపోవడం కూడా రికవరీకి కష్టంగా మారింది.


నగరంలో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

సీసీఎస్‌దే కీలకపాత్ర..

వరంగల్ కమిషనరేట్ పరిధిలోని సీసీఎస్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. అంతరాష్ట్ర దొంగల ముఠా, కరుడుగట్టిన దొంగలను పట్టుకోవడంలో సీసీఎస్ కీలక పాత్ర పోషిస్తోంది. సొత్తు రికవరీలో సీసీఎస్ ఏడాదిన్నరలో 4 కిలోల 315 గ్రాముల బంగారం, 12 కిలోల 260 గ్రాముల వెండి, 10.48 లక్షల నగదు, 23 వాహనాలు, మొబైల్‌లు 81, మూడు ల్యాప్‌టప్‌లును రికవరీ చేశారు. దీని విలువ 3.13 కోట్లు ఉంది. ఇలా పెద్ద మొత్తంలో కేసులు చేధించి రికవరీ చేయడంలో వరంగల్ మట్టెవాడ పోలీసులు, వరంగల్ సీసీఎస్ పోలీసులు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

రికవరీలు ఇలా..

మట్టెవాడ పోలీసులు గత సంవత్సర కాలంగా వరంగల్ కమిషనరేట్ పరిధిలో అన్ని పోలీసు స్టేషన్ల కన్నా ఎక్కువ మొత్తంలో రికవరీ చేశారు. గడిచిన ఏడాదిన్నర కాలంలో మట్టెవాడ పీఎస్ పరిధిలో రూ. 1.60 కోట్ల విలువ గల సొత్తును రికవరీ చేశారు. 2 కిలోల 12 గ్రాముల బంగారం, 25 ద్విచక్ర వాహనాలు, ఐదు ఆటోలు, ఐదు కార్లను రికవరీ చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

చోరీలు పెరుగుతుండడంతో నగరవాసులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. కాలనీవాసులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే, నిందితులను పట్టుకోవడం సులభంగా ఉంటుందని సూచిస్తున్నారు. విలువైన వస్తువులు ఇంట్లో ఉంటే తగిన జాగ్రతలు తీసుకోవాలని పేర్కొంటున్నారు. కాలనీల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.

'నీట్ పరీక్ష లీకేజీపై విచారణ జరిపించాలి'



మాట్లాడుతున్న ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీం నవీద్

పోచమ్మమైదాన్, జూన్ 22 : నీట్ పరీక్షలో జరిగిన అవకతవకల పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీంనవీద్ డిమాండ్ చేశారు. పోచమ్మమైదాన్‌లోని కార్యాలయంలో శనివారం ఏఐఎస్‌బీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎన్‌టీఏ వైఫల్యంతోనే లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి పోయిందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కన్వీనర్ రోహిత్, నాయకులు అఖిల్, సుమన్, రాజు, సాయి, హరీష్ పాల్గొన్నారు.

చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల పనులు పూర్తి చేయండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, జూన్ 22: బల్దియా పరిధిలోని రెండు చోట్ల ఏర్పాటు చేసిన చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు ఆదేశించారు. హనుమకొండ బాల సముద్రం, వరంగల్ పోతననగర్‌లోని చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లను సిబ్బందితో కలిసి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సివిల్ పనులు పూర్తిచేసి త్వరగా చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లను వినియోగంలోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. రెండు ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు పని చేస్తే నగరంలో ఉన్న చాలా చెత్తను త్వరితగతిన తరలించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈలు రాజయ్య, సంజయ్‌కుమార్, డీఈలు రవికుమార్, సంతోష్ బాబు, శానిటరీ సూపర్‌వైజర్ శ్యాంరాజు పాల్గొన్నారు.


బాలసముద్రం చెత్తట్రాన్స్‌ఫర్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

రెండు రోజులు నీటి సరఫరా బంద్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 22 : వరంగల్ దేశాయిపేట ప్రతాపరుద్ర ఫిల్టర్‌బెడ్ పైపులైన్ మరమతు పనులు కొనసాగుతున్నందున రెండు (సోమ, మంగళ) రోజుల పాటు నీటి సరఫరా ఉండదని ఫిల్టర్‌బెడ్ ప్రాంతాల పరిధిలో నివసించే ప్రజలు సహకరించాలని బల్దియా ఈఈ శ్రీనివాస్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిల్టర్‌బెడ్ పరిధి ప్రాంతాల పైన దేశాయిపేట, కొత్తవాడ, ఆటోనగర్, పోచమ్మమైదాన్, ఎల్బీనగర్, కాశిబుగ్గ, కంటి ఆస్పత్రి, ఎంజీఎం ఏరియా, కేఎంసీ, మట్టెవాడ, వరంగల్ చౌరస్తా, బట్టలబజార్, సంతోషి మాత కాలనీ ఏరియా, హంటర్‌రోడ్డు, చార్‌బౌళి, గోవింద రాజులగుట్ట, క్రిస్టియన్‌కాలనీ, లేబర్‌కాలనీ, ఎన్‌టీఆర్‌కాలనీ, ఏనుమాముల, ఆరెపల్లి, కొత్తపేట, గొర్రెకుంట, కీర్తినగర్, పైడిపెల్లి, మొగిలిచర్ల, ధర్మారం ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని ప్రజలు గమనించి సహకరించాలని ఈఈ కోరారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో జ్యేష్ఠ పౌర్ణమి వేడుకలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

మట్టెవాడ, జూన్ 22 : బట్టలబజార్‌లోని బాలనగర శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా శనివారం స్వామి వారికి జ్యేష్ఠాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో స్వామి వారికి అభిషేకించారు. స్వపన సేవా సమితి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో రత్నాకర్‌రెడ్డి, చైర్మన్ పరాశరం శ్రీనివాసచార్యులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు యోగాలో ప్రపంచ రికార్డు సర్టిఫికెట్



ఖిలావరంగల్, జూన్ 22 : ప్రపంచ యోగా దినోత్సవం జూన్ 21, సందర్భంగా యోగా ఛాలెంజ్ కార్యక్రమం హ్యాబిల్డ్ యోగా స్వచ్ఛంద సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ఒకే రోజు లక్షలాది మందితో యోగా కార్యక్రమాన్ని చేపట్టి రికార్డును సాధించింది. అందులో భాగంగా శివనగర్‌కు చెందిన న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు శామంతుల శ్రీనివాస్ ఆన్‌లైన్‌లో యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో శ్రీనివాస్‌కు ప్రపంచ రికార్డు సర్టిఫికెట్‌ను సదరు స్వచ్ఛంద అందజేశారు.

చురుకుగా సాగుతున్న ఇన్నర్‌రింగ్ రోడ్డు పనులు

గీసుగొండ, జూన్ 22 : వరంగల్ మహానగరం తూర్పు వైపు ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు చురుకుగా సాగుతున్నాయి. నాయుడు పెట్రోల్ పంపు, తూర్పుకోట బయటి నుంచి, చింతల్, జాన్‌పాక, గొర్రెకుంట క్రాస్‌రోడ్డు మీదుగా కీర్తినగర్, ఏనుమాముల మార్కెట్ రోడ్డు వరకు ఇన్నర్‌రింగ్ రోడ్డును దశల వారీగా 200 ఫీట్ల వెడల్పుతో చేపట్టనున్నారు. అయితే మొదటి దశలో నాయుడుపెట్రోల్ పంప్ నుంచి చింతల్ రోడ్డు వరకు గల 4.7 కి.మీ రోడ్డు పనులు ఇప్పటికే చేపట్టారు. ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం 200 ఫీట్ల వెడల్పుతో అధికారులు భూసేకరణ పూర్తి చేశారు. నిబంధనల మేరకు ప్రధాన ఇన్నర్‌రింగ్ రోడ్డుకు ఇరువైపులా 6.5 మీటర్ల వెడల్పుతో మొదటగా డ్రైనేజీ, సర్వీస్‌రోడ్డును నిర్మించేందుకు రూ.35కోట్లతో ప్రతిపాదనలతో బల్దియా అధికారులు టెండర్‌లను ఆహ్వానించారు. టెండర్ పొందిన సంబంధిత కాంట్రాక్టర్ కొద్ది నెలల క్రితం సర్వీస్‌రోడ్డు పనులు చేపట్టారు. డ్రైనేజీ, మెటల్‌రోడ్డు పనులు పూర్తికావటంతో ప్రస్తుతం బీటీ రోడ్డు పనులు చురుకుగా సాగుతున్నాయి. సర్వీస్ రోడ్లకు దాదాపు 60 ఫీట్లు పోగా మధ్యలో మిగిలిన 140 ఫీట్ల వెడల్పుతో ప్రధాన ఇన్నర్‌రింగ్ రోడ్డును నిర్మిస్తారని అధికారులు చెబుతున్నారు. మొదటి దశలో నాయుడు పెట్రోల్ పంప్ నుంచి చింతల్ రోడ్డు వరకే పనులు సర్వీస్ రోడ్డును పూర్తిచేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. రెండోదశలో జాన్‌పాక, గొర్రెకుంట క్రాస్‌రోడ్డు, కీర్తినగర్‌కాలనీ, మీదుగా ఏనుమాముల మార్కెట్ రోడ్డు వరకు పనులు చేపట్టనున్నట్లు స్పష్టం చేస్తున్నారు. తూర్పుకోట ఇన్నర్‌రింగ్ రోడ్డు నుంచి స్తంభంపల్లి, వంచనగిరి, శాయంపేటహవేలి మీదుగా కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులోకి 100 ఫీట్లతో రోడ్డు నిర్మాణానికి కూడా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈ రోడ్డు పూర్తి అయితే ధర్మారం, స్తంభంపల్లి, వసంతాపూర్, దూపకుంట, వంచ నగిరి పరిసర ప్రాంతాల రూపురేఖలు మారనున్నాయి. ఇప్పటికే స్తంభంపల్లి, జాన్‌పాక, వంచనగిరి శివారుల్లో భూముల రేట్లకు రెక్కలొచ్చాయి.


సాగుతున్న ఇన్నర్‌రింగ్ రోడ్డు బీటీ పనులు

గుట్కా పట్టుకున్న పోలీసులు



వరంగల్ క్రైం, జూన్ 22 : ప్రభుత్వం నిషేధించిన రూ.40వేల విలువ కలిగిన గుట్కాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిన్నవారి స్ట్రీట్‌లో గుట్కా నిల్వలు చేసినట్టు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. గుట్కా నిల్వ చేసిన ఆరిఫ్ అనే వ్యక్తిని మట్టెవాడ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ సార్ల రాజు, సుంకరి రవికుమార్ ధృవీకరించారు.

మామునూర్‌లో పీడీఎస్ రైస్..

మామునూరులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు 40 కింటాళ్ల రూ.1లక్ష 4వేల విలువకలిగిన పీడీఎస్ రైస్‌ను పట్టుకున్నారు. చిన్న, సమ్మయ్య అనే ఇద్దరు వ్యక్తులు మామునూరు పరిసర ప్రాంతాల్లో రైస్ సేకరిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం మామునూరు పోలీసులకు అప్పగించారు.

స్పోర్ట్స్ హాస్టళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 22: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(సాట్) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఉన్న మూడు స్పోర్ట్స్ హాస్టల్‌లో నిరుపేద విద్యార్థులకు వసతి కల్పించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆర్థిక స్థోమత లేక, క్రీడల్లో ఉత్సాహం, ఆసక్తి ఉన్న పేద విద్యార్థులకు 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ఉచిత చదువులతో పాటు వివిధ క్రీడాంశాలలో తర్ఫీదు అందిస్తూ రాష్ట్రానికి, దేశానికి గుర్తింపు తీసుకవచ్చే మెరికలాంటి క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు స్పోర్ట్స్ స్కూల్‌లు వేదికలుగా నిలుస్తున్నాయి. 1 సెప్టెంబరు 2015 నుంచి 31 ఆగస్టు 2016 మధ్య జన్మించిన వారు 2024-25 విద్యా సంవత్సరానికి 3వ తరగతి పూర్తిచేసి 4వ తరగతిలో స్పోర్ట్స్ స్కూల్‌లో చేరేందుకు వరంగల్, హనుమకొండ జిల్లా కేంద్రాలలో శారీరక సామర్థ్యం పరీక్షలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేయనున్నారు. రాష్ట్రంలోని మూడు స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలు పొందేందుకు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన 20 మంది బాలుర, 20 మంది బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఉమ్మడి రాష్ట్రంలోని ఒక్కో జిల్లా నుంచి 20మంది బాలురు, 20మంది బాలికలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రాష్ట్రంలోని మూడు స్పోర్ట్స్ స్కూల్‌లకు గాను ఒక్కో స్కూల్‌కు 40 మంది బాలురు, 40మంది బాలికలకు ప్రవేశాలను అందించనున్నారు. ఆసక్తి అర్హత కలిగిన విద్యార్థులు 4పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, కులధ్రువీకరణ, జననధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్టు, ఆధార్ కార్డులను వెంట తీసుకొని ఈ నెల 27న ఉదయం 8గంటల లోపు రిపోర్టు చేయాలని వరంగల్, హనుమకొండ జిల్లాల డీవైఎస్‌వోలు టీవీఎల్.సత్యవాణి, గుగులోత్ అశోక్‌కుమార్‌లు తెలిపారు.

జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు ఇలా..

వైద్య పరీక్షల్లో నెగ్గిన విద్యార్థులకు పలు శారీరక సామర్థ్య అంశాల్లో ఎంపిక పోటీలు ఉంటాయి. జిల్లా యువజన క్రీడల అధికారుల పర్యవేక్షణలో జిల్లా కేంద్రాలలోని వివిధ క్రీడా మైదానాలలో ఎత్తు, బరువు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, వర్టికల్‌జంప్, 30మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, 800 మీటర్ల పరుగు, 6ఇంటూ10 షటిల్ రన్, ఫ్లెక్సిబిలిటీ పరీక్ష, మెడిసిన్ బాల్‌త్రోలో బాలబాలికల వేరు వేరుగా ఎంపి పోటీలు నిర్వహిస్తారు. ఒక్కో పరీక్షకు అత్యధికంగా 3పాయింట్లు ఉండగా, ఇందులో 10 పాయింట్లు సాధించిన 20మంది బాలురు, 20మంది బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుంది.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- టీవీఎల్.సత్యవాణి, డీవైఎస్‌వో వరంగల్



వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 11 మండలాలకు చెందిన విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు జిల్లాస్థాయిలో ఈ నెల 27నుంచి 29వ తేదీ వరకు వరంగల్ కాశీబుగ్గ ఓసిటీలోని క్రీడా మైదానంలో శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహించనున్నాం. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 20మంది బాలురు, 20మంది బాలికలు జులై 8 నుంచి 12వ తేదీ వరకు రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ (సాట్) ఆధ్వర్యంలో హకీంపేటలోని క్రీడా పాఠశాల మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయిలో పోటీలకు ఎంపిక చేస్తాం. వరంగల్ జిల్లాకు చెంది 3వ తరగతి పూర్తి చేసి 4వ తరగతలో స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశా కోసం ఏర్పాటు చేసిన ఎంపిక పోటీలను సద్వినియోగం చేసుకోవాలి.

వైద్యం మిథ్య!

(5వ పేజీ తరువాయి)

పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోతున్నాయి. వివిధ రోగాల బారిన పడిన సందర్భంలో గ్రామీణ ప్రాంత ప్రజలు ఆర్‌ఎంపీలను, పీఎంపీలను ఆశ్రయిస్తున్నారు.

మందుల కొరత

ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, పల్లె దవాఖానాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రుల్లో మందుల కొరత తీవ్రంగా ఉంది. రోగులకు పెట్టడానికి గ్లూకోజు బాటిళ్లు కూడా చాలినన్ని ఉండడం లేదు. జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులకు ప్రతీ రోజు 500 మంది వరకు ఏరియా ఆస్పత్రులకు 300 వరకు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లుకు 150 వరకు, పీహెచ్‌సీలకు 100 వరకు, ఆరోగ్య ఉప కేంద్రాలకు 50 మంది వరకు రోగులు వస్తుంటారు. యాంటీబయాటిక్, యాంటీ రేబిస్, ఏఆర్‌వీ, ఇన్సులిన్ వంటివి కూడా అందుబాటులో ఉండడం లేదు. మూణ్నెళ్లకోసారి వచ్చే మందుల కోటా కూడా సరిగా లేవడం లేదు. ప్రస్తుతం వర్షాకాలం. అంటువ్యాధులు ప్రబలే కాలం. కనీసం ఈ సమయంలోనైనా అవసరమైన మందులను అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటు ఉంచాల్సి ఉండగా.. ఆ పరిస్థితి కనిపించడం లేదు. చాలా ఆస్పత్రుల్లో సరైన మందులు లేక రోగులు బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది.

సీకేఎం ఆస్పత్రిలో కొత్త పడకలు

- ఇటీవల ఆస్పత్రికిచేరిన 60 పడకలు
- తన నిధుల నుంచి రూ.25 లక్షలు కేటాయించిన ఎమ్మెల్సీ సారయ్య


పోస్టు ఆపరేటివ్ వార్డులో నూతన పడకలను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్, ఆర్ఎంవో

గిర్మాజిపేట, జూన్ 22 : వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య నిధులతో 60నూతన పడకలు ఇటీవలవచ్చాయి. నిత్యం 500 మంది అవుట్ పేషంట్, 180 ఇన్ పేషంట్ రోగులతో రద్దీగా ఉండే ఈ ఆస్పత్రిలో పడకలు దొరకక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పడకలు చాలా వరకు పాతవి కావడం, కొన్ని విరిగిపోగా, మరికొన్ని పరుపులు చిరిగిఉండటంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. రోగులు పడుతున్న ఇబ్బందులను సూపరింటిండెంట్ డాక్టర్ నిర్మలాకుమారి జిల్లా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చి నూతన పడకలను కేటాయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్సీ సారయ్య తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.25లక్షలు ఆస్పత్రికి పడకల కోసం కేటాయించారు. తెలంగాణ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టిఎస్‌ఎంఎస్‌ఐడిసి) ఎమ్మెల్సీ నిధులతో రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లోని సాయి ఎంటర్‌ప్రైజెస్ ద్వారా నూతన పడకలను సీకేఎం ఆస్పత్రికి అందించారు. హర్యానా నుంచి వచ్చిన నూతన హైడ్రాలిక్ పడకలను హైదరాబాద్ నుంచి వచ్చిన టీఎస్‌ఎంఎస్ సిబ్బంది ఆస్పత్రి సూపరింటిడెంట్ సూచనల మేరకు పోస్టు ఆపరేటివ్ వార్డులో 35, లేబర్ రూం దగ్గర వార్డులలో 25 పడకలను బిగించారు. ప్రతి మంచంపై పరుపు, దిండుతోపాటుగా సైడ్‌కు ర్యాక్‌ను కూడా బిగించారు. వార్డులలో నూతన పడకలను సూపరిండెంట్, ఆర్ఎంఓ డాక్టర్ శ్యాంకుమార్‌లు పరిశీలించారు. స్త్రీ సంబంధిత వ్యాధులు, ప్రసవాలకు, నవ జాత శిశువులకు కార్పోరేట్ స్థాయిలో మేరుగైన వైద్య సేవలు ఉచితంగా అందిస్తుండటంతో ఆస్పత్రిలో రోగుల తాకిడి నిత్యం రద్దీగా ఉంటుందని, ఆస్పత్రికి అవసరమైన మరో వంద నూతన పడకలను వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గ అభివృద్ధి నిధులతో ఏర్పాటు చేయాలని సూపరింటిండెంట్ కోరారు.

మిషన్ భగీరథ సర్వేను పూర్తిచేయాలి

ఖానాపురం, జూన్ 22 : మిషన్ భగీరథ తాగునీటి సర్వేను పూర్తి చేయాలని జడ్పీ సీఈవో రాంరెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి. రికార్డులను పరిశీలించారు. మండలంలో కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వే సరళిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ తాగునీరు వృథాకాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలంలో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు గ్రామాల్లో పారిశుధ్య పనులుచేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, ఎంపీవో రవి తదితరులు పాల్గొన్నారు.



'నీట్‌పై స్పందించని సీఎం, కేంద్ర మంత్రులు'

నర్సంపేట, జూన్ 22 : నీట్‌పరీక్షలో జరిగిన అవకతవకలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ స్పందించడం లేదని బీఆర్‌ఎస్‌వి నర్సంపేట నియోజకవర్గ నాయకుడు సదిరం వినయ్ భాస్కర్ అన్నారు. పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద శనివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షలో జరిగిన అవకతవకల వల్ల తెలంగాణలో 75 వేల మంది నీట్ పరీక్ష రాసిన విద్యార్థుల భవిష్యత్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచించడంలేదని అన్నారు. నీట్ పరీక్షను రద్దుచేసి, మళ్లీ పరీక్ష నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నల్ల రవీందర్, మురహరి, రాజేశ్, విష్ణువర్ధన్, ఎర్ర శ్రీకాంత్, బబ్లూ, అజయ్, ఎండి.బోలేమియా, శంకర్, తరుణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దొంతికి మంత్రివర్గంలో చోటు కల్పించాలి



మాట్లాడుతున్న ఎల్లగౌడ్

ఖానాపురం, జూన్ 22: నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డికి రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు కల్పించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మోడెం ఎల్లగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడూ అండగా నిలబడి, క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా, పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా కాంగ్రెస్ పార్టీ కోసం నిత్యం కష్టపడుతూ పార్టీ అభ్యున్నతి కోసం కృషి చేసిన ఎమ్మెల్యే మాధవరెడ్డికి మంత్రి వర్గంలో చోటు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు పల్స ప్రశాంత్‌గౌడ్, భూక్య అనిల్‌నాయక్, నరేష్, చెడిపాక వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



సదస్సులో మాట్లాడుతున్న ప్రభాకర్

నర్సంపేట టౌన్, జూన్ 22 : పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని స్వయం కృషి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి బెజ్జంకి ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్వయం కృషి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యం లో శనివారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు వాతావరణంపైన తీవ్రమైన మార్పులను చూపిస్తాయని, వాతావరణ మార్పు కారణంగా పర్యావరణ పరిస్థితుల్లో మార్పులు వస్తుందన్నారు. వాతావరణ సమతుల్యతను కాపాడుకోవడంలో అడవులు ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. అడవులను కాపాడుకోవాలని, పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కాంతారావు, పీఈటీ స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు

పర్వతగిరి, జూన్ 22: మోడల్‌స్కూల్‌లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పెన్నా శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లలో డైరెక్టు అడ్మిషన్లకు గాను 24వ తేదీ సోమవారం నేరుగా పాఠశాలకు వచ్చి అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో...

ఖానాపురం : మండలంలోని బుధరావుపేట ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, కళాశాలలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పెరుమాండ్ల సదాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీలలో ఖాళీగా ఉన్న సీట్లలో డైరెక్టు అడ్మిషన్లకు అర్హులైన విద్యార్థులు సోమవారం సర్టిఫికెట్లతో పాఠశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో ఫిజిక్స్ బోధించుటకు దరఖాస్తుల ఆహ్వానం

మండలంలోని బుధరావుపేట ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఫిజిక్స్ సబ్జెక్ట్ బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పేరుమాండ్ల సధాకర్ శనివారం తెలిపారు. ఫిజిక్స్ సబ్జెక్టును ఆంగ్ల మాధ్యమంలో గంటల ప్రాతిపదికన బోధించేందుకు ఎమ్మెస్సీ ఫిజిక్స్, బీఈడీ ఇతర అర్హతలు కలిగిన వారు బయోడేటాతో పాటు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో సోమవారం కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



ఎంపీడీవోకు ఫిర్యాదు అందిస్తున్న తండావాసులు

పర్వతగిరి, జూన్ 22 : మండలంలోని భట్టుతండా-2 గ్రామ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని పలువురు తండావాసులు శనివారం ఎంపీడీవో శంకర్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కార్యదర్శి తనకు నచ్చిన వారిని సిబ్బందిగా పెట్టుకుని ఇష్టారీతి న తీర్మానాలు చేస్తూ బిల్లులు చెల్లిస్తుందని ఆరోపించారు. ఉపాధిహామీ పథకంలో పనులు చేయనివారికి బిల్లులు వచ్చేలా చేస్తుందని, అభివృద్ధి పనుల విషయంలో కూడా లెక్కచెప్పకుండా ఇష్టారాజ్యంగా బిల్లులు చెల్లిస్తుందని ఆరోపించారు. గ్రామ పంచాయతీ ఆటోను సైతం ఇష్టం వచ్చినట్లు వాడుతున్నారని, వీటన్నింటిపై తక్షణమే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

120 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పర్వతగిరి, జూన్ 22 : మండలంలోని ఏబీ తండా గ్రామశివారు ఉట్టితండాలో 120 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గుగులోత్ వెంకన్న తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు సంయుక్తంగా శనివారం తెల్లవారుజామున తండాలో దాడులు నిర్వహించగా, పరకాలకు చెందిన పస్కం రమేష్ అనే వ్యక్తి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి తండాలో 120 క్వింటాళ్ల బియ్యం డంపింగ్ చేసినట్లు తెలిపారు. దీంతో బియ్యాన్ని స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేశామని, రేషన్ బియ్యం విలువ సుమారు రూ.3,12,000 ఉంటుందని, బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించినట్లు ఆయన వివరించారు.

రైతులు విపత్తుల బారినపడకుండా చూసుకోవాలి

రాయపర్తి, జూన్ 22 : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో భాగంగా రైతులు విపత్తుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారిణి ఉషాదయాల్, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావులు సూచించారు. శనివారం మండలకేంద్రంలో ఎన్డీఆర్‌ఎఫ్ ఫామెక్స్‌లో భాగంగా రైతువేదికలో ఎన్డీఆర్‌ఎఫ్ టెన్త్ బెటాలియన్ సభ్యుల కమ్యూనిటీ అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకు ముందు వ్యవసాయ అధికారులు, జాతీయ ఆహార భద్రత మిషన్ కన్సల్టెంట్ పి.సారంగంతో కలిసి మండలంలోని మొరిపిరాల, రాగన్నగూడెం, జ్యోతిరాం తండాల్లోని వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వలన కలిగే వరదలు, పిడుగుల నుండి పాడిపశువులను సంరక్షించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షం కురిసినప్పుడు చెట్ల కింద, బండల పైన ఉండకూదని, పశువులను సైతం సురక్షిత ప్రాంతాలకు తరలించాని తెలిపారు. అనంతరం రైతులు వరి, పత్తి పంటల్లో ప్రస్తుతం తీసుకోవాలని జాగ్రత్తలు వాడాల్సిన ఎరువులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సురేష్, ఏవో వీరభద్రం, ఎస్‌ఐ సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం.. జరభద్రం

ఇళ్ల ముందు పారుతున్న మురుగునీరు

దోమల స్వైర విహారం

రోగాల బారిన పడుతున్న ప్రజలు



బస్టాండ్ ఏరియాలో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

నర్సంపేట టౌన్, జూన్ 22 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నా క్షేత్రస్థాయిలో ఎక్కడా అమలు కావడంలేదు. పారిశుధ్య చర్యలు లేక నర్సంపేట మునిసిపాలిటీలోని వార్డులు కంపుకొడుతున్నాయి. స్వచ్ఛ భారత్ నినాదాలకే పరిమితమైపోయింది. పట్టణంలోని 24వార్డుల పరిధి కాలనీల్లో పారిశుధ్య చర్యలు లేకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రతీ ఏటా వర్షాకాలం ప్రారంభంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నా మునిసిపల్ అధికారులు, పాలకవర్గం చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. సీజనల్‌లో వచ్చే వ్యాధులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల బాటపట్టే వారు రోజు రోజుకు పెరుగుతున్నారు. ముఖ్యంగా నర్సంపేట జిల్లా ఆస్పత్రికి సీజనల్ వ్యాధులతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరుతున్నారు. వర్షాకాలంలో డెంగీ, విషజ్వరాలు, వాంతులు, విరేచనాల బారిన పడే అవకాశం ఉన్నందున మునిసిపల్ అధికారుల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

పేటలో పారిశుధ్య లోపం

నర్సంపేట పట్టణంలోని 24వార్డుల్లో ప్రధాన రహదారి వెంట మినహా వార్డుల్లో పారిశుధ్య లోపంతో ప్రజల్లో వాధుల భయం పట్టుకున్నది. కుమ్మరికుంట కాలనీ, రాజీవ్‌నగర్, లెనిన్‌నగర్, ద్వారకపేటరోడ్, మహబూబాబాద్ రోడ్డుకు ఇరువైపుల ఉన్న కాలనీలు, ఎన్టీఆర్‌నగర్, ఇటీవల ఏర్పడిన నూతన కాలనీల్లో పారిశుధ్య లోపం కనిపిస్తుంది. వారాల తరబడి చెత్తను ఇళ్ల నుంచి తీసుకెళ్లకపోవడం, డ్రైనేజీలను నిత్యం శుభ్రం చేయకపోవడంతో దోమలు స్వైరవిహారం చేస్తూ ప్రజలు రాత్రుళ్ల నిద్రకు దూరమవుతూ రోగాల బారినపడుతున్నారు.

మురుగు కాలువలు అస్తవ్యస్తం

నర్సంపేట పట్టణంలోని మురుగు కాల్వలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు డ్రైనేజీల్లో వరదనీరు పొంగిపోయి రోడ్లపై నిలిచిపోయి మురుగుగుంతలుగా ఏర్పడ్డాయి. పట్టణంలోని బస్టాండ్ ఏరియాలో డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడం మురుగునీరంతా దుకాణసముదాయాల ముందు చేరి కంపుకొడుతున్నా పట్టించుకున్ననాథుడే లేడు. మల్లంపల్లిరోడ్, గాంధీ విగ్రహం ఏరియా, మహబూబాబాద్‌కు ఇరువైపుల కాలనీలతో పాటు అనేక వార్డుల్లో మురుగు కాలువల నిర్మాణంలేకపోవడం, ఉన్నవాటిని శుభ్రంచేయకపోవడంతో ఇళ్ల ముందు మురుగునీరు ప్రవహిస్తున్నది.

పట్టించుకోని అధికారులు..

పారిశుధ్య పనులు చేపట్టడంలో మునిసిపల్ అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. మాధన్నపేట రోడ్‌లో వారాల తరబడి కాల్వలను శుభ్రంచేయడం లేదని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపానపోలేదని ప్రజలు వాపోతున్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో చెత్తాచెదారం కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నా తొలగించేవారులేకుండా పోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.ఇళ్ల నిర్మాణంచేపట్టకుండా ఖాళీగా ఉన్న స్థలాలు మురుగునీరుచేరి దోమలకు ఆవాసాలవుతున్నాయని పరిసర ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా పట్టణంలో పారిశుధ్య చర్యలు చేపట్టి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చూడాలని వివిధ ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు మునిసిపల్ అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

మాట నిలుపుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం



వర్ధన్నపేటలో సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

వర్ధన్నపేట, జూన్ 22 : రైతులకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ఫైసా సురేష్‌లు అన్నారు. శనివారం వర్ధన్నపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌వద్ద కాంగ్రెస్ శ్రేణులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, ఎమ్మెల్యే నాగరాజుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి బాణాసంచాపేల్చి మిఠాయిలు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఆంగోత్ అరుణ, సమ్మెట సుధీర్, మంచాల రామకృష్ణ, తుమ్మల రవీందర్, పోషాల వెంకన్న, సిలువేరు శ్రీధర్, అయిత ప్రవీణ్, పులి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● నెక్కొండ : దేశానికి వెన్నముఖ అయిన రైతన్నలకు అడ్డంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని నర్సంపేట టీపీసీసీ మెంబర్ సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి అన్నారు. రైతుల రుణమాఫీకి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలుపడంపై హర్షం వ్యక్తంచేస్తూ అంబేద్కర్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిల చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరిశ్‌రెడ్డి,జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి శివకుమార్, రామాలయ కమిటి చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు రాచకొండ రఘు, కుసుమ చెన్నకేశవులు, రావుల మైపాల్‌రెడ్డి, మెట్టు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

● సంగెం : రూ.2లక్షల రుణమాఫీకి క్యాబినెట్ ఆమోదం పొందడంతో మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కందగట్ల కళావతినరహరి, మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, పరకాల అధికార ప్రతినిధి జనగాం రమేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, నాయకులు గుమ్మడి హరిబాబు, గూడ సంపత్‌రెడ్డి, ఎంపీటీసీలు గుగులోత్ వీరమ్మ, కట్ల సుమలతనరేష్ తదితరులు పాల్గొన్నారు.

● పర్వతగిరి : రైతులకు రూ.2 లక్షల మేర రుణ మాఫీ చేస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం నిర్వహించారు. బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనీల్‌రావు మాట్లాడగా, మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, సొసైటీ చైర్మన్ గొరై దేవేందర్, నాయకులు సునీల్‌రావు, రాంచందర్, కందికట్ల అనిల్, చలపతిరావు, వెంకటేశ్వర్‌రావు, సువర్ణ, సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట: రైతులకు రూ. 2లక్షల రుణ మాఫీచేయటం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దెన రమేష్‌లు అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ బ్లాక్ కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, మండల యూత్ అధ్యక్షుడు బండి హరీష్, మండల నాయకులు కుండె కుమారస్వామి, జోరు వీరయ్యగౌడ్ పాల్గొన్నారు.

● గీసుగొండ : రైతులకు ఆగస్టు 15 లోపు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని కేబినెట్ ఆమోదం తెలిపినందుకు హర్షం వ్యక్తంచేస్తూ కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కొనాయిమాకులలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు చెరుకుపల్లి సాంబరెడ్డి, వజ్ర రాజు, రహీంపాష, కొమ్ము శ్రీకాంత్, ఆకుల రుద్రప్రసాద్, దూలం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల పొదల తొలగింపు



ముళ్ల పొదలను తొలగిస్తున్న పోలీసులు

నెక్కొండ, జూన్ 22 : మండలంలోని ప్రధాన రహదారుల వెంట మూల మలుపుల వద్ద దట్టంగాపెరిగిన ముళ్ల పొదల కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నందున ముళ్ల పొదలను తొలగిస్తున్నామని నెక్కొండ సీఐ చంద్రమోహన్ తెలిపారు. శనివారం మండలంలోని ప్రధాన తారురోడ్ల వెంట ఉన్న ముళ్ల చెట్లను తొలగించారు. మండలంలో ఉన్న సింగిల్ రోడ్లను ఇటీవల డబుల్ రోడ్లుగా నిర్మాణం చేయడంతో గతంలో రోడ్లు దూరంగా ఉన్న వ్యవసాయ బావులు దగ్గరయ్యాయన్నారు. బావుల చుట్టూ ముళ్ల పొదలు దట్టంగా పెరగడంతో రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ముళ్ల చెట్లను తొలగించడమే కాకుండా బావుల చుట్టూ ఇనుప కంచను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై మహేందర్ , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు .

కేశవాపురం జీపీ రికార్డులు తనిఖీ

దుగ్గొండి, జూన్ 22 : మండలంలోని కేశవాపురం గ్రామాన్ని ఎంపీడీవో అరుంధతి శనివారం సందర్శించి పంచాయతీ రికార్డులను తనిఖీచేశారు. అభివృద్ధికి సంబంధించిన పనుల రికార్డులు సక్రమంగా ఉండేవిధంగా చూడాలని కార్యదర్శి సంతోష్‌కుమార్‌ను ఆదేశించారు. గ్రామంలో నిరంతరం పరిశుభ్రత పనులు చేపట్టాలన్నారు. తాగునీటిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి



ఎల్లయ్య (ఫైల్)

దుగ్గొండి, జూన్ 22 : మండల కేంద్రానికి చెందిన కన్నం ఎల్లయ్య (110) శతాధిక వృద్ధుడు శనివారం మృతి చెందారు. మృతిచెందిన ఎల్లయ్యకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాల్గో తరం కుటంబ సభ్యులను ఆయన చూసినట్లు గ్రామస్థులు వెల్లడించారు.

మిషన్ భగీరథ సర్వేను పూర్తి చేయాలి

ఖానాపురం, జూన్ 22 : మిషన్ భగీరథ తాగునీటి సర్వేను పూర్తి చేయాలని జడ్పీసీఈవో రాంరెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. మండలంలో కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వే సరళిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ తాగునీరు వృధాకాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలంలో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు గ్రామాల్లో పారిశుధ్య పనులుచేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భారతి,ఎంపీడీవో రవి తదితరులు పాల్గొన్నారు.

యువత ఆత్మహత్యలకు పాల్పడ వద్దు

నర్సంపేట, జూన్ 22 : క్షణికావేశంలో యువకులు ఆత్మహత్యలకు పాల్పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ అన్నారు. పట్టణంలోని జ్యోతిబస్ నగర్‌కాలనీ చెందిన యువకుడు కందికట్ల అజయ్ ఆత్మహత్యకు పాల్పడి చనిపోగా అతని కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట యాకయ్య మోటం సురేశ్, బందారు మల్లేష్, ఈర్లరాజు, రతన్, సతీష్, పవన్, అంజి, ఖాజా, స్వరూప ఉన్నారు.

కోళ్లఫారం ఏర్పాటుపై జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడికి ఫిర్యాదు

రాయపర్తి, జూన్ 22 : మండలంలోని పన్యా నాయక్ తండాలో ఏర్పాటు చేస్తున్న కోళ్ల ఫారం నిర్మాణంపై శనివారం ఎంపీటీసీ భూక్యా క్రాంతి, డాక్టర్ భూక్యా రాజారాం నాయక్‌లు హన్మకొండలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌కు ఫిర్యాదుచేశారు. కోళ్లఫారం బాధితులకు తగు న్యాయం చేయాలని కోరారు. తండాలోని నివాస గృహాలకు అతి దగ్గరగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న కోళ్ల ఫారం చుట్టూ ఉన్న రైతులు, ప్రజలు ఇబ్బందులు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. చిత్తలూరి సంధ్యారాణి అనే భారీ కోళ్ల ఫారాన్ని రద్దుచేసి బంజారాలకు న్యాయం చేయాలని వేడుకున్నారు. దీనిపై విచారణచేసి బంజారాలకు న్యాయం చేసే విధంగా కలెక్టర్‌కు ఆదేశాలు ఇస్తామని హుస్సేన్ నాయక్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మధ్య తరగతి కుటుంబానికి దూరమవుతున్న విద్య

వర్ధన్నపేట రూరల్, జూన్ 22 : కార్పొరేట్ సంస్థల ఫీజుల పెంపుదలతో మధ్య తరగతి కుటుంబాలకు ప్రైవేటు విద్య దూరమవుతోందని జిల్లా బీజేపీ నాయకులు కుందూరు మహేందర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మండలంలోని కడారిగూడెంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు విద్యా సంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల పై అధిక ఫీజులు మోపుతూ ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పుస్తకాలు, బట్టలు అమ్మి అనవసరమైన వాటిని అంటగడుతూ లక్షలు ఆర్జిస్తున్నారని తెలిపారు. ప్రైవేటు విద్యా సంస్థలకు అనుకూలంగా పనిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

దుగ్గొండి, జూన్ 22 : మండలంలోని నాచినపల్లిలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన బండారి లక్ష్మణ్ కుటుంబానికి గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రూ.48వేలు, 100 కిలోల బియ్యం పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు రాజిరెడ్డి, వెంకటేశ్వర్లు, రఘుపతి ఉన్నారు.

ఎగిసిపడుతున్న నీరుతో రైతు హర్షం



బోరులో నుంచి ఎగిసిపడుతున్న నీరు

వర్ధన్నపేట, జూన్ 22 : నీటి వసతి లేక భూమిలో బోరు వేసేందుకు రెండుసార్లు యత్నించిన రైతుకు బండ వెక్కిరించింది. అయినప్పటికీ నిరాశ చెందని ఆ రైతు మరోసారి భగీరథ ప్రయత్నం చేయగా మొదట వేసిన బోరులో నుంచి నీరు ఉవ్వెత్తున ఎగిసిపడిన సంఘటన వర్ధన్నపేట పట్టణ శివారులోని తాళ్లకుంటతండాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే తాళ్లకుంట తండాకు చెందిన వాంకుడోత్ మణి అనే రైతు తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో బోర్ వేసేందుకు పాయింట్ సిద్ధం చేసుకుని తగు ఏర్పాట్లు చేసుకున్నాడు. ఈ క్రమంలో శనివారం బోరు డ్రిల్లింగ్ బండి పొలంలోకి వచ్చి 50 ఫీట్ల లోతు వరకు డ్రిల్లింగ్ చేయగా బండ అడ్డుగా వచ్చి డ్రిల్ ముందుకు సాగలేదు. ఈ క్రమంలో రైతు మరోచోట 200 ఫీట్ల వరకు బోరు వేసినా చుక్కనీరు రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యాడు. అయినప్పటికీ ఆశ చావక మరింత లోతుకు బోరు వేసేందుకు యత్నించడంతో నీరు రాలేదు. కానీ పక్కనే ఉన్న మొదట వేసిన 50 ఫీట్ల బోరులో నుండి నీటి ప్రవాహం ఉధృతంగా అంత ఎత్తున ఎగిసిపడుతుండడంతో రైతు, బోర్‌వెల్ సిబ్బంది తీవ్ర సంభ్రమాశ్చర్యానికి గురయ్యారు. ఏది ఏమైనా రైతు బోరులో నుండి నీరు పైకి వస్తుండడంతో హర్షం వ్యక్తం చేశారు.

వైద్యం మిథ్య!

(5వ పేజీ తరువాయి)

పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోతున్నాయి. వివిధ రోగాల బారిన పడిన సందర్భంలో గ్రామీణ ప్రాంత ప్రజలు ఆర్‌ఎంపీలను, పీఎంపీలను ఆశ్రయిస్తున్నారు.

మందుల కొరత

ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, పల్లె దవాఖానాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రుల్లో మందుల కొరత తీవ్రంగా ఉంది. రోగులకు పెట్టడానికి గ్లూకోజు బాటిళ్లు కూడా చాలినన్ని ఉండడం లేదు. జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులకు ప్రతీ రోజు 500మంది వరకు ఏరియా ఆస్పత్రులకు 300 వరకు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లకు 150 వరకు, పీహెచ్‌సీలకు 100 వరకు, ఆరోగ్య ఉప కేంద్రాలకు 50 మంది వరకు రోగులు వస్తుంటారు. యాంటీబయాటిక్, యాంటీ రేబిస్, ఏఆర్‌వీ, ఇన్సులిన్ వంటివి కూడా అందుబాటులో ఉండడం లేదు. మూణ్నెళ్లకోసారి వచ్చే మందుల కోటా కూడా సరిగా లేవడం లేదు. ప్రస్తుతం వర్షాకాలం. అంటువ్యాధులు ప్రబలే కాలం. కనీసం ఈ సమయంలోనైనా అవసరమైన మందులను అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటు ఉంచాల్సి ఉండగా.. ఆ పరిస్థితి కనిపించడం లేదు. చాలా ఆస్పత్రుల్లో సరైన మందులు లేక రోగులు బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది.

మహిళల రక్షణకు కమిటీలు

ఏర్పాటుకు అధికారుల కసరత్తు

వర్ధన్నపేట, జూన్ 22 : పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులను అరికట్టేందుకు అంతర్గత మహిళా కమిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధానంగా మహిళా ఉద్యోగులపై వేధింపులు జరుగుతున్నట్లు రాష్ట్రవ్యాప్తంగా ఆరోపణలు వస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకుంది. మహిళా ఉద్యోగుల రక్షణపై ప్రత్యేక దృష్టి పెడుతుంది. మునిసిపాలిటీల్లో అంతర్గత మహిళా కమిటీలను ఏర్పాటు చేయాలని ఏప్రిల్ 29న మున్సిపల్ శాఖ సంబంధిత మునిసిపల్ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. మొన్నటివరకు లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమైన అధికారులు కమిటీలపై ముందడుగువేయలేదు. ఇపుడు ఎన్నికల ప్రక్రియ పూర్తికావడంతో అంతర్గత మహిళా కమిటీలు వేసేందుకు మునిసిపల్‌శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కమిటీల్లో ఎవరెవరు ఉంటారంటే...

మునిసిపాలిటీల్లో ఏర్పాటు చేసే అంతర్గత మహిళా కమిటీల్లో మహిళా ఉద్యోగిని ప్రిసైడింగ్ అధికారిగా నియమించాలి. సీనియర్ ఉద్యోగి లేకపోతే ఇతర ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఒక సీనియర్ మహిళా ఉద్యోగిని ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుంది. ఇద్దరు సభ్యులు మహిళా చట్టాలపై అవగాహన, సామాజిక సేవలో చురుకుగా పాల్గొనే వారిని, మహిళా సమస్యలపై పోరాడే వారిని ఈ కమిటీలో ఎంపిక చేయనున్నారు.

వేధింపులు తగ్గే అవకాశం..

మునిసిపాలిటీల్లో వివిధ హోదాల్లో మహిళా ఉద్యోగులు, కార్మికులు విధులు నిర్వహిస్తుంటారు. ప్రస్తుతం ఏర్పాటు చేయనున్న అంతర్గత కమిటీలు వారి రక్షణకు కృషి చేయనున్నాయి. మహిళా ఉద్యోగులపై ఎవరైనా వేధింపులకు పాల్పడితే ఈ కమిటీ విచారణ చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూస్తుంది. వేధింపులకు కారకులైన వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తుంది. ప్రభుత్వ నిర్ణయం వల్ల మహిళలపై వేధింపులు తగ్గి వారికి పూర్తిస్థాయిలో రక్షణ లభిస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

ఈ నెలాఖరులోగా కమిటీ ఏర్పాటు

ఈ.జోనా, మునిసిపల్ కమిషనర్, వర్ధన్నపేట



మునిసిపాలిటీలో వేధింపులను అరికట్టేందుకు మహిళా కమిటీలను ఏర్పాటు చేయాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ఐఏఎస్ అధికారి డి.దివ్య ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఎన్నికల కారణంగా కమిటీని ఏర్పాటు చేయలేక పోయాము. ఈ నెల చివరిలోగా కమిటీని ఏర్పాటు చేస్తాం.

కృత్రిమ ఇసుక దందా

అసైన్డ్ భూములను వదలని బకాసురులు

యథేచ్ఛగా ప్రభుత్వ విద్యుత్ వాడకం

ఎక్స్‌కవేటర్ల సాయంతో తరలింపు

మామూళ్ల మత్తులో ఆయా శాఖల అధికారులు



కొత్తపెల్లిలో మట్టిని కడుగుతున్న దృశ్యం

వర్ధన్నపేట రూరల్, జూన్ 22 : సారవంతమైన భూములు అక్రమార్కుల చేతుల్లో పడి నిస్సారంగా మారుతున్నాయి. ఇసుక దోపిడీదారుల ఆగడాలకు భూ మాత కన్నీరు పెడుతోంది. ఎడాపెడా యథేచ్ఛగా మట్టిని తవ్వడంతో భవిష్యత్తులో భూ గర్భ జలాలకు ప్రమాద ఘంటికలు మోగనున్నాయి. ఆకేరు వాగు పరివాహక ప్రాంతాలో ఉండే ఇసుకను మట్టిని తవ్వేస్తూ, ఇప్పుడు అసైన్డ్ భూములను, పట్టా భూములను సైతం ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా భారీ హిటాచీలు, జేసీబీలతో తవ్వి తరలిస్తున్నారు. పంటలు వేయాల్సిన భూములను ఇసుక కోసంతీసి, అప్పటి లాభాపేక్షం కోసం తృప్తి పడుతున్న వారికి అధికారులు అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారు. కొంతమంది చేస్తున్న ఈ దుశ్చర్యలకు ఇతర రైతులు సైతం ఎంతో నష్టపోతున్నారు.మట్టిని ఇసుకగా మార్చి వందలాది ట్రాక్టర్లలో తరలిస్తున్న సంబంధితశాఖ అధికారులు ఎలాంటి చర్యలుతీసుకోవడంలేదు.మామూళ్ల మత్తులో ఆయా శాఖల అధికారులు మునిగితేలడంతో కృత్రిమ ఇసుకతయారీ, రవాణా మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.

ఇసుక తయారీతో నేలలు నిర్వీర్యం...

పంటల సాగు చేపట్టాలంటే మట్టి, ఇసుక రేణువులతో కూడిన సారవంతమైన భూమి అవసరం. వర్ధన్నపేట మండల పరిధిలో ఉన్న ఆకేరు వాగు పరివాహక ప్రాంతాల్లో మట్టి నుంచి కృత్రిమంగా ఇసుకను తయారు చేసి అక్రమ దందా సాగిస్తున్నారు. మండలంలోని కొత్తపెల్లి, ల్యాబర్తి గ్రామాల మీదుగా వెళ్తున్న ఆకేరు వాగు ఇక్కడి గ్రామస్థులకు వరప్రదయానిగా మారింది. ఇల్లంద గ్రామస్థులు కొందరు ఇల్లంద శివారుకు ఆనుకుని ఉన్న ఆకేరు వాగులోని మట్టిని లూటీ చేస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ట్రాక్టర్లకు ఇంజన్లను అమర్చడంతోపాటు కొన్ని చోట్ల విద్యుత్‌ను వాడుతూ మోటార్లు పెట్టి వాటి ప్రెజర్ల సహకారంతో మట్టిని కడిగి ఇసుకను తయారు చేస్తున్నారు. మట్టిక్వాలిటీని బట్టి రేటు తీసుకోవడంతో పాటు ఇసుక కూడా అలా తయారుచేయడం ఇక్కడి స్పెషాలిటీ. అసైన్డ్ భూములు తమకు సంబంధించినవే అంటూ కొంత మంది రోజుకు ఒక్కో ట్రాక్టర్ చొప్పున రూ.2వేల నుంచి రూ.3 వేలకు పైగా వసూలు చేస్తూ సంపాదిస్తున్నారు. కొంత మంది వ్యవసాయ బావులు సైతం వాగు పరివాహక ప్రాంతాల్లో ఉండడంతో వారే స్వయంగా డంపులు, ప్లాంటులు ఏర్పాటు చేసి వ్యవసాయానికి వాడాల్సిన కరెంటును అక్రమ వ్యాపారానికి వాడుతూ కాసులు వెనకేసుకుంటున్నారు. విద్యుత్ అధికారులు వీరిపై దృష్టి సారించకపోవడంతో ప్రభుత్వ ఉచిత విద్యుత్ నిర్వీర్యమవుతోంది. భారీ హిటాచీలు, జేసీబీల సహాయంతో మట్టిని తోడడంతో సారవంతమైన భూముల్లో పంట పండని విధంగా తయారవుతున్నాయి.

చెక్ డ్యాంలు, బ్రిడ్జి పిల్లర్ల చుట్టూ...

మండలంలోని ల్యాబర్తి గ్రామంలో ఉన్న చెక్ డ్యాంలతో పాటు బ్రిడ్జి పిల్లర్ల చుట్టూ జేసీబీ సహాయంతో ఇసుకను తీస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. గతంలో భారీ వర్షాలకు ఇసుక మేటలు కట్టడంతో కొందరు వ్యక్తులు ఇసుకను అమ్ముకునేందుకు బ్రిడ్జి పిల్లర్ల చుట్టూ భారీ రంధ్రాలు చేశారు. వీటిపై గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

పట్టించుకోని పాలకులు..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గతంలో మట్టిని తీసిన గుంతలోకి భారీగా నీరుచేరి వ్యవసాయ భూములు కోతకు గురయ్యాయి. అన్నదాతలు తీవ్రస్థాయిలో నష్టపోయారు. తాటి వనాలు, మామిడి తోటలు, విద్యుత్ స్తంభాలు, పలు దేవాలయాలకు కూడా ఇసుకాసురుల నుంచి ప్రమాదంఉంది. మామూళ్ల మత్తులో పడి కొందరు అధికారులు అక్రమార్కులతో అంటకాగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా ఉన్నతాధికారులైన దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.